కథ

# ఘర్షణ



— పెద్దింటి అశోక్ కుమార్

"మొగడు మస్కట్ పోయిండని ఆగుతలేదు. పూటకొక చీర కట్టి రోజుకొక ఊరుతిరుగుతుంది. బొమ్మలెక్కతాయారయి వచ్చిపోయేటోల్లతోని ఇదు వకుంట ముచ్చటపెడుతది. చేతుల నాలుగుపైసలు కనపడంగనే కండ్లు నెత్తినెక్కినయి" ఈర్ష్య గా అన్నది లలిత.

"ఇంతకుముందు బిత్తిరి దానిలెక్క ఉండె. ఇప్పుడు కండ్లకు అద్దాలు, కాళ్ళకు చెప్పులు వచ్చినయ్. దేశంగాని దేశంల అడ్డమైనోనికి వాడుగులాంగిరి చేసి పైసలు పంపుతుంటె ఇది ఇక్కడ ఆటలాడుతుంది. మాట గూడా మాట్లాడుతలేదు" బదులిచ్చింది వసంత.

అక్కడికి రేణుక రావడంతో వారిసంభాషణ ఆగిపోయింది. ఒక్కసారిగా ఫారిన్ సెంటువాసన గుప్పుమంది. లలిత వసంతలు ఒకిరి మొహం ఒకరు చూసుకుని గుంబనంగా నవ్వుకున్నారు.

"ఏంటిదక్కా... ఇంకా ఆడుతలేరు. ఓ దిక్కు మొగులు ఎక్కవస్తుంది. వానగిట్లపడుతదేమో! నాలుగు చుట్లు తిరిగి ఆడుతమో లేదో డప్పులోల్లు వచ్చి బతుకమ్మలను లేపుతరు. ఆడుకుందాంరండి" అక్కడ ఉన్న లలితను వసంతను మరో ఇద్దరు ముగ్గురిని ఉద్దేశిస్తూ అన్నది రేణుక.

ఊరి మధ్య మూడువీధుల్ని కలిపే ప్రదేశం అది. బతుకమ్మ పండుగ వచ్చిందంటే ఆడ, మగపిల్లలు అందరూ అక్కడే ప్రత్యక్షమవుతారు. బతుకమ్మల్ని అక్కడ చేర్చి ఆడుకుంటారు. విరగబూసిన తోట నిండా సీతాకోకచిలుకలు తిరుగుతున్నట్టుగా మారిపోతుంది అప్రదేశం.

అక్కడ గుమికూడినవారు రేణుకవైపు ఆసక్తిగా ఈర్ష్యగా చూశారు. ఆమె కట్టుకున్న చీర గురించి నగలగురించి ఆరా తీశారు. సెంటుబాగానే చల్లుకున్నావని ఎద్దేవా చేశారు కొందరు. మరదలు వరస ఉన్నవారు సరసాల పేరుతో తమ అక్కసు నంతా వెళ్ళబోసుకున్నారు. రేణుక చిన్నబుచ్చుకుంది.

అప్పటికే బతుకమ్మలతో అందరూ అక్కడికి చేరుకున్నారు. ఆట మొదలయింది. అర గంట సేపు కూడా సాగలేదు. ఆట నుండి విడివడి జట్టుజట్లుగా కూడి ముచ్చట్లలో మునిగిపోయారు ఆడవారు. మగవారు వీధిఅరుగుల మీదకూర్చుండి చూస్తున్నారు.కొందరి చేతుల్లో ఫలహారాల క్యారియర్ లున్నాయి.

"అయ్యో! ఏంటి దుండ్లా... చీరలు కట్టుకున్నంత సేపైనా ఆడకపోతిరి. ఇంకా పొద్దున్నది. ఆడుదాం రండి" ఒకగుంపును ఉద్దేశిస్తూ ఉత్సాహంగా అన్నది రేణుక. లలిత వసంతలు అదే గుంపులో ఉన్నారు. రేణుక మాటలకు వెక్కిరిస్తున్నట్టుగా మూతివిరిస్తూ అన్నారు.

"నీకేం... మా రాజువు. పొద్దుగూకెదాక ఆడుతవు. తెల్లారేదాక ఆడుతవు. కూసుండితినుడే నాయే! మాకు నాట్లకు, కలుపులకు వంగి వంగి నడుము గుంజుతుంది. ఇంకేం ఆడుమంటవు"

రేణుక మనసు చివుక్కుమంది. ఏదో అందామనుకుని బావుండదని ఆగిపోయింది.వారు ఎందుకలా ఎత్తిపొడుస్తున్నారో ఆమెకు తెలుసు. ఈ మధ్య మరీ రెచ్చిపోతున్నారు. ఏమైనా అంటే విపరీతార్థాలు తీసి పంచాయితీ చేయడానికి రెడీగా ఉన్నారు. అందుకే మౌనంగా ఉండిపోయింది రేణుక. అప్పుడే డప్పుల చప్పుడయింది. ఎవరి బతుకమ్మను వారు ఎత్తుకున్నారు.

"ఏం పిల్లా ... బాగున్నావా? మొగుడు మస్కట్ పోయిన నుండి కనపడుతలెవ్వు అవ్వగారింట్లనే ఉంటున్నావా?" ఒకవృద్ధురాలు అటకాయించిందిరేణుకను.

బతుకమ్మను ఎత్తుకుని ముందుకు నడుస్తూ "లేదత్తా ఇక్కడనే ఉంటున్న నీ పాణమెట్లుంది" ఆప్యాయతగా పలకరించింది.

"గట్లనె ఉంది బిడ్డా. గదేదో షుగర్ బీమారట నెలరోజుల జేరమచ్చిపన్నాపరేగానీ ఆ బీమారురాకూడదంట. పెయ్యన్ని నొప్పులె. మరి పైసలు పంపుతున్నడా? జీతంబాగనే ఉందట గదా" రేణుక వెంటనడిచింది ఆమె.

పంపుతున్నడు" పొడిపొడిగా చెప్పి ముందుకు నడిచింది రేణుక.

వృద్ధురాలు ఒకసారి దీర్ఘంగా నిట్టూర్చి గొణుక్కున్నట్టుగా అన్నది 'మాలచ్చిగాన్ని రెండేండ్లు పోయి రారా అంటేపోకపాయె. పెండ్లాన్నిమాసుకుంట ఇట్లనే ఉండె"

వినిపించికూడా వినపడనట్టే మౌనంగా ఉండిపోయింది రేణుక! పక్కనే ఉన్న మరోస్త్రీ మాత్రం రేణుకవైపు అసూయగా చూస్తూ అన్నది.

"ఏం పోవుడు అక్కా... వయసు పెండ్లాలను ఇక్కడ విడిచిపెట్టి దేశాలమీద పోతే మంచిదాయె, చెడదాయె. ఎవలింట్లవాళ్ళు చాతనైన కాడికి ఇక్కడనే చేసుకబతకాలె. ఏం పైసపాడైంది. పైససంపాయించాలనే ఎర్రికొద్దిమొగోళ్ళు దేశాలు పట్టుకతిరిగితే ఆడోళ్ళు ఊర్లుతిరుగుతుర. మొన్న మా తమ్ముని అత్తగారింటికాడ గట్లనెజరిగింది. లగ్గమైనంక యాడాదికే మస్కట్ పోయిండట. నాలుగేండ్లు అక్కడనే ఉండి లక్షల పైస పంపిండట. ఇక్కడ పెండ్లాం ఎవ్వనికో మరిగి వాడు వచ్చేవరకు పైస, బంగారంలతో లేచిపోయిందట"

గుంపులో నడుస్తున్నవారుతలో మాట అంటున్నారు. తమకు తెలిసిన విషయాలు చిలువలు పలువలుగా చెప్పుకుంటున్నారు. కొందరు ఆడవారిని తప్పు పడుతున్నారు. మరికొందరు మగవారిని తప్పుపడుతున్నారు. వారిమాటలుశూలాల్లా గుచ్చుకుంటున్నాయి. వాటినివినలేక నడక వేగాన్ని పెంచి ముందుకు వెళ్ళిపోయింది రేణుక.

అలా వేగంగా వెళ్ళిపోవడంకూడా తప్పయినట్టు ఒకరిద్దరు నిలదీసి అడిగారు రేణుకను. సైనాల వద్ద కూడా సూటిపోటి మాటల్ని విన్నది. యారాండ్లు (తోటికోడళ్ళు) పరుగలు తీస్తూ కేరింతలు కొడు

